కల్పవల్లి.. మూలపెద్దమ్మ తల్లి

- కొలిచే వారికి కొంగు బంగారం
- ఈ నెల 10 నుంచి వచ్చే నెల 11 వరకు పెద్దమ్మ జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు



భక్తులకు దర్శనమిస్తున్న మూలపెద్దమ్మ అమ్మవారు



మూలపెద్దమ్మ జాతరకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రంలో కొలువైన మూల పెద్దమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతున్నారు. కొలిచే వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న మూల పెద్దమ్మ భక్తుల నుంచి పూజలుందుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 10 నుంచి వచ్చే 11వ తేదీ వరకు నెల రోజుల పాటు జాతర నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా ఉగాది పండుగ మరుసటి రోజు మూలపెద్దమ్మ వారి జాతర ప్రారంభమవుతుంది. నెల రోజుల పాటు ప్రతి మంగళవారం, ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు. దాతల సహకారంతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూలపెద్దమ్మను దర్శించుకునేందు వచ్చే వివిధ ప్రాంతాల భక్తులకు మౌలిక సదుపాయాలతో పాటు,అన్ని ఏర్పాటు చేస్తున్నారు.

10 నుంచి ప్రత్యేక పూజలు

ఈ నెల 10వ తేదీ నుంచి వచ్చే నెల 11వ తేది వరకు జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్ తెలిపారు. 10న దేవస్థానం వారిచే అమ్మవారికి ఉదయం ఆకుపూజ, కుంకుమార్చన పూజలు ఉంటాయి. సాయంత్రం అమ్మవారి ఘటానికి పోవుట, వాల్మీకులు బోనాలు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 11న ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకు పూజ, కుంకుమార్చన పూజలు చేసుకునేందుకు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఏడాది భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర సందర్భంగా భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్, ఈఓలు తెలిపారు. 11వ తేదీ బైక్‌స్లో పందెం, గుండు ఎత్తుట, తాడులాగు పోటీలు నిర్వహిస్తున్నారు.

జాతరకు ప్రత్యేక బందోబస్తు

మూలపెద్దమ్మ జాతరకు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకార్యార్థం నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలోనికి భారీ వాహనాలు రాకుండా దారి మళ్లించనున్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



మూల పెద్దమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. నెల రోజుల పాటు ప్రతి మంగళవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా వస్తుంటారు. భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇప్పటికే అన్నిశాఖల అధికారుల సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేశాం.

– తలారి చిన్నన్న, ఆలయ చైర్మన్

భక్తులకు ప్రత్యేక బస్సు సౌకర్యం



జాతరకు వచ్చే భక్తులకు నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భక్తులు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకుని అమ్మవారిని దర్శించుకోవాలి.

–మోహన్, ఈఓ, మూలపెద్దమ్మ ఆలయం

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: శ్రీ క్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్లను శ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదివారం కర్నూలు నగరంలో ఆవిష్కరించారు. క్యాలెండర్ల ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు కర్నూలు నగరంలో పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి–ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు, కల్లూరు కమిటీల అధ్యక్షులు, సభ్యులు నాగయ్య, పురుషోత్తం, గంగాధర్, మహేష్, వాసు, మధువాణి తదితరులు పాల్గొన్నారు.

17న సీతారాముల కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఈనెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు మిషన్ నిర్వాహకులు స్వామిని సుప్రేమానంద సరస్వతి తెలిపారు. 9 నుంచి 16వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అష్టోత్తర శతనామావళి, ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఉగాది ఉత్సవాలు

కోడుమూరు రూరల్: ఈనెల 8వ తేదీ నుంచి వల్లెలాంబదేవి ఆలయంలో ఉగాది ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, గంగపూజ, సాయంత్రం ప్రభోత్సవం కార్యక్రమాలను ఉంటాయని చెప్పారు.

ఘనంగా అంతర్జాతీయ జియోలజిస్టల దినోత్సవం

కర్నూలు (న్యూటౌన్): జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ జియోలజిస్టల దినోత్సవాన్ని ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డీడీ టి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ మాలవాళి కోసం కొత్త ఖనిజ నిక్షేపాలు, బంగారు, బొగ్గు గనులను వెలికితీయడంతో జియోలజిస్టల పాత్ర ఎంతో కీలకమన్నారు. జియోలజిస్టల సేవలు ఎనలేనివని, విపత్కరపరిస్థితుల్లో ఎంతో మంది ప్రాణాలను ఫణంగా పెట్టారని, వారు చేసిన మేలును ఎల్లప్పుడూ స్మరించుకుంటామన్నారు.

ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు



సి.బెళగల్ పోలీస్‌లు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

సి.బెళగల్: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పోలీస్ సిబ్బందితో మండలంలోని గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తిమ్మందొడ్డి గ్రామ సమీపంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సి.బెళగల్‌లో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

ఓటరు నమోదుకు 16 వరకు దరఖాస్తులు స్వీకరణ

పాణ్యం : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ఫణికుమార్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేవాల మేరకు ఇంకా ఎవరైన దరఖాస్తు చేసుకోనివారు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 16వ తేది వరకు దరఖాస్తులను పరిశీలించి సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు అనుమతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరైన ఓటుకు దరఖాస్తు చేసుకోకుంటే బీఎల్‌ఓలకు గాని, ఆన్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్‌యూ స్కాలర్‌కు డాక్టరేట్ ప్రదానం



లితేష్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వ విద్యాలయం పరిశోధక విద్యార్థి కర్నూలుకు చెందిన లితేష్‌కు మేనేజ్‌మెంట్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పుచ్చా వెంకట సుందరానంద తెలిపారు. వర్సిటీ ఎంబీఏ హెచ్‌ఓడీ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో 'కమాడిటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్ ఇన్ ఇండియా – ఎ స్టడీ విత్ రిఫరెన్స్ టు ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ ఇన్ రాయలసీమ రీజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ అవార్డు వచ్చినట్లు వెల్లడించారు. ఆర్‌యూలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్‌లో మొట్టమొదటి రెగ్యులర్ పీహెచ్‌డి డిగ్రీకి పర్యవేక్షకులుగా వ్యవహరించిన ఆచార్య విశ్వనాథరెడ్డిని, స్కాలర్ లితేష్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్, రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న అభినందించారు.

రాయపాటి శ్రీనివాస్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్‌కు ఉత్తమ సేవా అవార్డు లభించింది. 2022–23 సంవత్సరానికి గాను విశిష్ట సేవలు అందించిన లయన్స్ క్లబ్‌లకు అవార్డుల ప్రదాన కార్యక్రమం ఆదివారం ప్రొద్దుటూరులో జరిగింది. ఆ సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధిగా రాయపాటి శ్రీనివాస్ జిల్లా గవర్నర్ ఏరియా రెప్రజెంటేటివ్‌గా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేస్తామన్నారు.

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం



కె.నాగలాపురంలో కోట్ల హర్ష, సతీష్‌కు స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు

గూడూరు రూరల్: సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. మండలంలోని కె.నాగలాపురంలో ఆదివారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామానికి వచ్చిన వారికి స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పింఛన్ మంజూరుకు, ఇళ్ల స్థలాలకు ఇంత అని నిర్దేశించి పేదల నుంచి డబ్బులు దండుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం కేవలం అర్హత ఆధారంగా పథకాలు అందజేస్తున్నారని, జగనన్న పాలనలో జనం సంతోషంగా ఉన్నారని, ఆ సంతోషాన్ని కొనసాగించుకోవాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ మౌలాలి, నరసంహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గూడూరు చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న, సుందరం, నాగరాజు, కొండారెడ్డి, సుబ్బన్న, సురేష్, ఉమామహేశ్వరమ్మ, అజీమా, శ్రీను, బీసీ మాదన్న, జ్యోతి పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శివనరసింహారెడ్డి

కల్లూరు : కల్లూరు అర్బన్‌లోని పందిపాడు గ్రామానికి చెందిన దాదాపు 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆదివారం ఎమ్మెల్యే స్వగృహంలో పందిపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నాగభూషణం, వెంకటేశ్వర్లు, రాజు, పర్ల వెంకటేశ్వర్లు, బోయ కృష్ణ, శంకర్, చిన్నరాజు, పెద్దరాజు, సురేష్, ధనుంజయ, సూరి పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వలన మేలు జరిగి ఉంటేనే మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా అడుగుతున్నారన్నారు. కార్యక్రమంలో కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్ టీయూ నాయకులు భీమేష్‌రెడ్డి, రామకృష్ణా యాదవ్, ఆదినారాయణ రెడ్డి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి ఓటు వేయండి



చింతమానుపల్లెలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పక్కన సతీష్

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే మరోసారి ఓటు వేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఆదివారం సాయంత్రం మండలంలోని చింతమానుపల్లె, తిమ్మందొడ్డి, సంగాల, పలుకుదొడ్డి గ్రామాల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అందుబాటులో ఉంటా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చానని, తనను ఎమ్మెల్యేగా గెలుపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాలకు జగనన్న పెద్దపీట వేశారన్నారు. టీడీపీ నాయకులు కుట్రలతో సంక్షేమ పథకాలు పేదలకు అందకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకుల మాటలు నమ్మొద్దని కోరారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ నరసింహుడు, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, సర్పంచ్‌లు హనుమంతు, ఇమ్మానియేల్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, మండల కార్యదర్శులు మహానంది, బాయికాటి మద్దిలేటి, ముందరింటి వెంకటేష్, గోపాల్, పులిరాజు, రామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు ముల్లా హారున్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్న కొండయ్య, నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సోమప్ప, రామాంజనేయులు, రాఘవేంద్ర, శోభన్‌బాబు పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): మే 1వ తేదీన నిర్వహించే మే డే వేడుకలను జయప్రదం చేసేందుకు ప్రతికార్మికుడు తనవంతు సహకారం అందించాల ని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నగర అధ్యక్షుడు జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తోందన్నారు. వెంటనే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు.

సీపీఎం ఇంటింటా ప్రచారం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా బరిలో నిలువనున్న డి.గౌస్‌దేశాయ్ విజయం కోసం సీపీఎం నాయకులు ఇంటింటా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆదివారం 12వ వార్డు పరిధిలోని డబరాలో ఆ పార్టీ నాయకులు డి.అబ్దుల్‌దేశాయ్, గోవిందు ప్రచారం చేశారు.

టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ కష్టాలే



కొరటమద్దిలో ప్రచారం నిర్వహిస్తున్న శివనరసింహారెడ్డి, నాయకులు

గడివేముల: టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మి ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వచ్చే నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతలు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మొద్దన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దస్తగిరిరెడ్డి, ఎల్లారెడ్డి, అయ్యపురెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం



31వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాటసాని మాధవీలత

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుమార్తె మాధవీలత అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 31వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు ప్రస్తుతం జగనన్న అందిస్తున్న పాలనకు తేడా గమనించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చేందాలంటే ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కొరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చిట్టెమ్మ, అరుణ, నాయకులు తిరుపాల్, కృష్ణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి



మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

కర్నూలు(సెంట్రల్): మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు కార్మికులు, కర్షకులు సిద్ధంగా ఉండాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పీఎస్‌రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక, కర్షక భవన్‌లో ప్రభుత్వ విధానాలపై ట్రేడ్ యూనియన్ల వర్కుషాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ వచ్చిన తరువాత కార్మికులను బానిసలుగా మార్చారన్నారు. 44 లేబర్ చట్టాలను 4 కోడ్‌లుగా మార్చేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లను జైలు పాలుజేసేందుకు పూనుకున్నారన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి కార్మికుల ఉద్యోగాలకు ఎసరు పెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో మోదీ, ఆయనకు మద్దతుగా నిలిచే టీడీపీ, జనసేన పార్టీలను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అంజిబాబు, నాగరాజు, బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం



ప్రచారంలో దుస్తులను ఇస్త్రీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 41వ వార్డులో ఎన్నికల ప్రచారం

కల్లూరు: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 41వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచారం చేశారు. వార్డుల్లో వృద్ధులను, మహిళలను, వివిధ వృతుల వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను చూసి వారి అభివృద్ధికి నవరత్నాల పథకాలు తీసుకువచ్చారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాప్రతినిధులందరిని ప్రజల దగ్గరకు పంపించారని చెప్పారు. దీంతో ప్రజాప్రతినిధులు ప్రభుత్వం చేసిన మేలు వారికి వివరించడంతో పాటు ఇంకా అవసరమైనవి ఏమైన ఉంటే తెలియజేసే అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు అరుణ, నాయకులు కవినాథ్‌రెడ్డి, భీమా శంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధవ స్వామి, గంగులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలికి అభినందనలు



సిట్రా సత్యనారాయణమ్మ దంపతులను సత్కరిస్తున్న జిల్లా కురువ సంఘం నాయకులు

కర్నూలు (న్యూటౌన్): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన సిట్రా సత్యనారాయణమ్మను జిల్లా కురువ సంఘం నేతలు అభినందించారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, గడ్డం రామకృష్ణ దంపతులకు జిల్లా కురువ సంఘం నాయకులు బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 4 లక్షల ఓటర్లు ఉన్న కురువలను గుర్తించి కురువ మహిళకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా పదవి ఇవ్వడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, సహాయ కార్యదర్శి కొత్తపల్లి దేవేంద్ర, కోశాధికారి కేసీ నాగన్న, పట్టణ అధ్యక్షులు తవుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.


ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలి



వైద్య పరీక్షలు చేయించుకున్న వృద్ధురాలిని పరామర్శిస్తున్న డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా

కర్నూలు (న్యూటౌన్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని ఎస్‌ఎంబీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం కల్లూరులోని ముజాఫర్‌నగర్ విజ్ఞాన్ సుధ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కిమ్స్ హాస్పిటల్, సుశీల నేత్రాలయ ఆసుపత్రి సహకారంతో ఎస్‌ఎంబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ ఆసుపత్రులకు వెళ్లలేని స్థితిలో ఉన్న పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యజమాన్యాలు వ్యాపార కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో పేద ప్రజలకు రాయితీ కల్పిస్తూ వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో ప్రధానంగా వృద్ధులు, చిన్నపిల్లలు వివిధ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, కిమ్స్ హాస్పిటల్, సుశీల నేత్రాలయ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ జీవనానికి దిక్సూచి భగవద్గీత



సందేశం ఇస్తున్న ఇస్కాన్ ప్రవచనకారులు వైష్ణోకృప చైతన్య ప్రభు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భగవద్గీత దిక్సూచిలా నిలుస్తుందని కర్నూలు ఇస్కాన్ ప్రవచనకర్త వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్రామాయి, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.